


# దిష్టి

వీరాజీ

**కాలేజి** సంగీతం పోటీలో ఫస్ట్‌ప్రైజ్ వచ్చిన కల్పన బహుమతి కప్పు తీసుకుంటూ వుంటే అభినందనల పరంపర, ఈలలు, చప్పట్లు, గోల మిన్నుముట్టాయి.

అది తీసుకుని మహదానందంగా, స్నేహితురాలు లతతో యింటికి బయలు దేరింది కల్పన.

లత యిల్లు కల్పన యింటి మీదుగా వెళితేనే దగ్గర. అందుకే లత తన రిక్షాలో ఎక్కించుకుంది కల్పనని ..

కల్పనకు ప్రయిజు వచ్చిన కప్పుని చూస్తూ, "కప్పు చాలా పెద్దదేనే! దీన్ని చూస్తూ వుంటే- నాకు డిబేట్‌లో కూడా యింతకప్పు యివ్వక పోయారా? వెధవలు, అని కడుపుమంటగా వుందే." అన్నది లత నవ్వుతూ...

నా వెండికప్పు పెద్దదే... 'వళ్లో పెట్టుకుంటే, బరువు కూడా వుందే. కల్పన నిట్టూర్చింది... "నీకేం తక్కువే. అన్నీ వున్నాయి. కావాలంటే మనం ఈ కప్పును ఎక్స్ఛేంజి చేసుకుందామా?" అంది.

"వద్దులే- అంత మాటన్నావ్. అదే చాలు- మీ అమ్మ, నాన్న చూసి ఎంత మురిసిపోతారో. తీసుకుపో.." అంది.

రిక్షాని జంక్షన్‌లో ఆపేసి దిగిపోయింది కల్పన... లత "ఇంటిదాకా వచ్చి దింపి పోతానబ్బా!" అన్నా కూడా వద్దని వారించి, "ఎంతబ్బా! నాలుగడుగులే కదా! **నేవెళతాలే-" అంటూ వెళ్లిపోవటం కల్పన కలవాటే!**

నిజానికి కల్పనకి అలాచేయడం యిష్టం లేదు. తన ఫ్రెండ్స్ తన యింటికి రావాలనీ, ఫ్రెండ్స్ యిళ్లకు తను వెళ్లా లని వుంటుంది కానీ, ఇంటిదగ్గర పరి స్థితులు అలాంటివికావు. ఒక్కొక్కసారి ఆశ్చర్యపోతూ వుంటుంది "ఈ బి. ఎ. ఫైనలియర్ దాకా నేనెట్లాగ వచ్చానురా భగవంతుడా," అని. తండ్రి కామేశం యింట్లో వున్నాడేమో, చూడలేని దృశ్యాలే మైనా ఎదురౌతాయేమోనని బెదురుతూనే గుమ్మంలో అడుగుపెట్టింది కల్పన..

మరొకరైతే, అంత పెద్ద బహుమతి వచ్చినందుకు రెక్కలు కట్టుకొని, బోలెడు ఉత్సాహంగా, యింటికివచ్చి- అమ్మవాళ్లోనో, నాన్న చేతుల్లోనో దాన్ని పెట్టి... ముద్దులు కురిసేవారు- కాని కల్పనను చూస్తూనే- ఏడుస్తున్న తమ్ముడూ, చెల్లీ, పదేళ్లరాంబాబు, ఎనిమిదేళ్ల సరళ వచ్చి, ఆమె కాళ్లకు చుట్టుకున్నారు.

తండ్రి కామేశం, తల్లి శారదమ్మా ఘర్షణ పడుతున్నారు. కామేశం కొంచెం చదువుకున్నవాడే- చేస్తున్న ఉద్యోగం కూడా గుమస్తాలాంటి వుద్యోగ మేకాని... దుర్వ్యసనాలపుట్ట. సాయంకాలమైందా... అతను అలగాజనంతో కలసిపోతాడు. త్రాగడం, పేకాడటం, ఈ రెంటిలో ఏది లేకపోయినా, అతడు నీళ్లలోంచి బైటకి తీసిపారేసిన చేపలాగా గిలగిల్లాడి పోతాడు. ఒకోసారి కూలీ నాలీ చేసుకుంటూ- బ్రతికేవాళ్లపాటి సంస్కారం కూడా ఉండదు. కల్పన కిదేమీ కొత్తకాదు. రాంబాబుని, సరళని బుజ్జగించింది.

"చూడమ్మా! చూడుబాబూ! నాకెంత మంచి బహుమతి వచ్చిందో... యిదో వెండికప్పు.. దీన్ని అక్కడ బల్ల మీద పెట్టండి" అంది కల్పన.

కామేశం శారదమ్మను, అంతక్రితమే జుట్టు పట్టుకుని, మెడలువంచి, వీపుమీద గుద్దినట్లున్నాడు- ఆమె కూలబడి నీళ్లునిం డిన కళ్లతో భర్తని విషపు పురుగుని చూసి నట్లు చూస్తున్నది. "దీని సిగదరగా... దీన్నేనాడు కట్టుకున్నానో- ఆనాటినుంచి నాకు దరిద్రం పట్టుకురది. ఛీ... ఛీ.. ముష్టిముండా కొంప. ఎప్పుడు చూసినా "తేరా! తే! గాడిదకొడకా!" అంటారే తప్ప ఒక్కనాడు యింటికి వచ్చేసరికి మన శ్శాంతి కలిగేలా అఘోరించి ఏడవరు... వెధవమూక-"

కామేశం యింకా తాగి రాలేదన్న మాట! మాట తడబడటం లేదు... భాష ఇంకా కొంచెం వినటానికి వీలుగావుంది.

ఛీ... ఛీ... పెళ్లీడు కూతురుంది. ఇంకా మొహానికి సిగ్గులేదు... పెళ్లాన్ని కొడతారు. పైగా నేనేం ఉద్యోగం చేస్తు న్నానా? లేకపోతే- అత్తారూ, అమ్మగారూ వదిలిపోయిన లంకెబిందెలు వున్నాయా? నన్ను పీక్కుతినకపోతే వెధవ తాగుడూ, జూదం మానేయరాదూ... శారదమ్మ గొంతేమీ చిన్నదికాదు.

"అబ్బ! మహా పతివ్రత చెప్పొచ్చి దికదా అని మానేస్తారే! పగలంతా నీకోసం, నీ సంతానంకోసం చాకిరీ చేసేది చాలక సాయంకాలం అలా క్లబ్బుకి పోయొస్తే... నీ అబ్బముల్లె పోయి నట్లు గోలెడతావ్, పైగా గుల్లమంతైంది

ఆడపిల్ల... యిదే మొగాడైతే, ఈ పాటికి చేతికందేవాడు దాన్నేమో కాలేజీకి తోల్తావ్,- ఏం? ఎందుకూ? ఏదైనా దుకాణంలో సేల్స్ గరల్‌గా పారేస్తే అదో వంద తెచ్చిపోసేదిగా నీ చేతిలో-"

నాన్నా! యింకా మీరు దయచేసి కొట్టుకోకండి. నేను పరీక్షలు రాయడాన్కి యింకా నెల్లాళ్లే టైముంది. అంతే... ఆ తర్వాత, నా పొట్టతిప్పలు నేనే పడతాన్లే.. ప్లీజ్! నువ్వు అమ్మని చావచంపక బయటికి పో.. ఆవిడకసలే గుండె దడకూడా వుంది-" కల్పన కోపంగా కసిరింది. "ఆహా హా! గుండె నొప్పట! అయితే ఓ అయిదు రూపాయలిలా పారేయమను... రాత్రికి పాతిక చేసుకొస్తాను..." "ఛీ... ఛీ! కన్నకూతురితోనా మీరిట్లా..." అంటూ శారదమ్మ అడ్డురాగా, కామేశం- 'ధూ' అంటూ చీదరించుకున్నాడు.

అఫ్టరాల్ ఫైవ్‌రుపీస్‌కి మొహం వాచాడీ కామేశం.. లాభంలేదు. నాకు క్లబ్బులో పరువుదక్క దీవాళ. సరే, ఏదో



ఒకటిలా పారేయ్," అంటూ అరిచాడు.

అంతలో కల్పనకి బహుమతి వచ్చిన కప్పు చూసాడు వెంటనే మెత్తబడిపోయాడు "అమ్మా! కల్పా! ఏంటే యిది? వెండి పూతకాబోలు! ఔనా? మనదేనా? ఎవరేనా ఎరువిచ్చారా?" అన్నాడు వెండి కప్పుని చేతిలోకి తీసుకుని.. కల్పనకి గ్రుడ్లలోకి నీళ్లు చిప్పిలి వచ్చాయి కాని, లోపల లోపలే దుఃఖం అదుముకుని- "అది నాకివాళ కాలేజీలో యిచ్చిన బహుమతి అమ్మా!" అంది తల్లి వేపు తిరిగి

"మామ్మే! నా తల్లే! నా అందాల బొమ్మే!" అంటూ శారదమ్మ లేచి, బిడ్డ దగ్గిరగావచ్చి తలనిమిరింది. కామేశం ఎంతో ప్రసన్నుడైనాడు...

"భలే బాగుందమ్మా! వస్తా... ఇప్పుడే మా ఫ్రెండ్సుకి చూపెట్టి-" అంటూ కప్పును చంకన బెట్టుకుని రివ్వున బయటికి వెళ్లిపోయాడు, కల్పన వారించే ప్రయత్నం కూడా చేయలేనంత త్వరగా ఆ అమ్మాయికి వేలాది హర్షధ్వానాలు మధ్య లభించిన 'అమూల్య' కానుకను మూల్యంగా మార్చటానికి- జూదంలో పణంగా పెట్టడాన్కి పట్టుకుపోయాడు కన్నతండ్రి!

ప్చ్! పోనీ. కర్మ. అది తాకట్టుపెట్టి తాగేస్తాడు- యీ పూట నాన్న పోన్లే అలాగేనా తండ్రికి ఈ బిడ్డ కాస్తంత ఆనందం యివ్వగలిగాననుకుంటుంది..." అంటూ దుఃఖం పట్టలేక తల్లి వొళ్లో తలదూర్చి బావురుమని ఏడ్చేసింది కల్పన.

శారదమ్మ ఏమంటుంది?

అంతా మన ఖర్మ తల్లి! యీ పాడుబుద్ధులు రోజు రోజుకీ ఎక్కువై పోతున్నాయి యీయనకి.. మన సరళ పుట్టక మునుపు అఖరికి సిగరెట్ కూడా ముట్టి ఎరగరమ్మా, అంటూ భర్త అవలక్షణాలను కూతురు దగ్గరే దాయాలని యత్నం చేసింది

"తెస్తారులే తల్లి! కప్పు అయనేం చేసుకుంటారు. నా బంగారు తల్లికివాళ ఎంత దిష్టి తగిలిందో... లే.. ఓసారి ఉప్పు దిగదుడిచి పారేస్తా"- నంది శారదమ్మ.

కల్పన వెలితిగా నవ్వింది.

"ఎందుకమ్మా... వుండనీ... ఆ వుప్పుకూడా దండగెందుకు? పిల్లలకి ముజ్జిగలోవేసి యిద్దువుగాని.. నాలాంటి మొద్దుకి రాగవిరాగేలే వుండవు.. యింక దిష్టి కూడానా?" అంది. తన కుమార్తెకి లభించిన అమూల్యమైన బహుమతిని మూల్యంగా మార్చుకునే తండ్రి కామేశం ఫొటో- అతని చిన్ననాటి దొకటి గోడకు వేలాడుతూ వుంటే దాన్ని చూసి కల్పన నోటి చివరిదాకా వచ్చిన తిట్లన్నీ అతికష్టం మీద అపుకుని బరువుగా నిట్టూర్చింది.

"నాకు దేవుడిచ్చిన కమ్మని నా కంఠం అనే బహుమతిని మాత్రం లాక్కోవులే నాన్నా!" అనుకున్నది భారంగా! ఆ కమ్మని వరానికి కామేశం దిష్టి తగలగలదా? ●